పిసినిగొట్టు

★

శ్రీమతి డి. ఎమ్. లత

రామనాథం పేరు మీరు వినివుండరు.. ఆమాటకొస్తే ఆయన్ను నేను మాత్రం ఎరుగుదునా? ఆయన తనకు తాను వచ్చి 'నాపేరు ఫలానా' అని చెప్పుకున్నాడు. ఆరు నెలల క్రితం ఆయన బంధు వెవరో నా దగ్గర చికిత్స పొంది ఆరోగ్యవంతు డైనాడట ! ఆయన సలహా మీదనే నా వద్దకు వైద్యం చేయించుకొనడానికి వచ్చాడట !

"మీకు జబ్బేమిటో చెప్పారుకాదు !" అని అడిగాను.

రామనాథం చేతులు రెండూ జోడించి నమస్కరిస్తూ —"అయ్యా ! మీరు ఫీజు ఎంత తీసుకుంటారో తెలవియ్యాలి" అని అడిగాడు.

"పది రూపాయలు !"

"బాబోయ్ ! పది రూపాయలే ! అంత యిచ్చుకోలేను డాక్టర్‌గారూ ! కనికరించి ఫీజు కొంచెం తగ్గించాలండీ !"

"అంత ఫీజు ఇచ్చుకోలేనంత బీదవాళ్లయితే నా కసలు ఫీజే యివ్వ నవసరంలేదు ! సరేనా ?"

రామనాథం మొహం ఒక్కసారిగా విప్పారింది ! ఆ తరువాత ఏమడగాలో తెలియక గాబోలు—మీసాలు సవరించు కున్నాడు.

ఇంతలో నేను మరొక రోగిని పరీక్షించడంలో మగ్నమై పోయాను. ఆ తరువాత కొంతసేపటికి అతన్ని బయటికి పంపించివేశాను. నేను రామనాథంవైపు చూశాను.

"అయ్యా డాక్టరుగారూ ! మా గుడివాడలో కూడా ఎం. బి. బి. ఎస్. చదివిన డాక్టర్లున్నారండి. అయినా నేను వాళ్ల దగ్గరకు వెళ్లకుండా బస్సుకు రూపాయున్నర ఖర్చు బెట్టుకుని ఇక్కడికి వచ్చానండి. భోజనానికి, కాఫీ, రిక్షాలకూ అప్పుడే అయిదు రూపాయలు ఖర్చయిపోయాయండి. ఇంటికి చేరుకునేప్పటికి మరొక అయిదు రూపాయలన్నా ఖర్చవుతా యండి. కనుక మీకు నేను రెండు రూపాయల కంటె ఎక్కువ ఫీజు యిచ్చుకోలేనండి !" అని అన్నాడు రామనాథం, నావైపు తిరిగి.

"మీకంత తాహతు లేకపోతే ఆ రెండు రూపాయలు కూడా నా కివ్వ నవసరంలేదు."

"మీ దగ్గర వైద్యం చేయించుకున్న మాఊరి గుత్తా వరసయ్యగారి కిష్టయ్య—మీరెంతో మంచివారని చెప్పాడండి. రోగులు ఎంత యిస్తే అంత మారు మాట్లాడకుండా తీసు కుంటారట !"

"అన్ని వస్తువుల ధరలు యిలా ఆకాశాన్ని అందు కుంటూ ఉంటే—ఏదో ఒకటి తీసుకొనకపోతే గడిచే దెలాగూ?'

రామనాథం బిగ్గరగా నవ్వాడు.

"అవునండీ ! ఎలా గడుస్తుందండీ ? ఎంత చెట్టు కంత గాలి ! .... నాకూ ఏదో కాస్త పొలం, పుట్రా ఉన్న దనుకోండి. పంటలు ఈ సంవత్సరం బాగానే పండినాయి. ధాన్యం ధరలు కూడా ఫరవాలేదు. అయితే .... "

రామనాథం ఇంకేమేమో చెప్పబోయాడు. కాని, అప్పుడే నా పరిచితు డొకాయన గాభరాగా లోనికి ప్రవేశించాడు. అతని భార్యకు చాలా ప్రమాదంగా ఉన్నదట !

"మీ రిక్కడే కూర్చోండి. ఇప్పుడే వచ్చేస్తాను" అని రామనాథంతో చెప్పి—బయటికి వెళ్లిపోయాను.

నేను గంట తరువాత గాని తిరిగి రాలేకపోయాను. రామనాథం అలాగే కూర్చొని ఉన్నాడు. వసారాలో మరొక స్త్రీ కూడా కూర్చొని ఉన్నది. ఆమె ముక్కు బాగా వాచింది. రెండు కళ్లూ బాగా ఎర్రగా ఉన్నాయి. మొహంమీద ఖాళీ లేకుండా చిన్న చిన్న కురుపు లున్నాయి. నన్ను చూసి ఆ స్త్రీ లేచి పక్కకు ఒదిగి నిలబడింది.

"అయ్యా ! డాక్టరుగారూ ! నేను మీకు ఐదు రూపాయలు ఇచ్చుకుంటానండి. ఇక పోతే నా జబ్బు విషయం ...."

రామనాథంమీద నాకు చెప్పలేనంత కోపం వచ్చింది. కాని, నా కోపాన్ని లోలోపల దిగమింగుకొని "అయితే మీరు ఐదు రూపాయలకంటె ఎక్కువ యిచ్చుకోలేరన్నమాట !" అని అన్నాను, నవ్వుతూ !

రామనాథం కూడా నవ్వాడు.

''అయ్యా, డాక్టరుగారూ ! మాది కూడా దొండపాడే నండి. గుత్తా నరసయ్యగారు మా బంధువేనండి. మరి మీరు ఫీజును మరికొంచెం మాఫీ చేయించాలి.''

నేను మారు మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నాను. నేను మాట్లాడకపోయేప్పటికి రామనాథం ఏమనుకున్నాడో ఏమో—''సరే, డాక్టరుగారూ ! ఫీజు ఆరు రూపాయలు యిచ్చుకుంటానండి !' అని చెప్పి ఆరు రూపాయలు ఒక్కొక్కటే లెక్కబెట్టి నాముందు ఉంచాడు.

''మీ జబ్బు ఏమిటో చెప్పండి !''

రామనాథం తన జబ్బును గురించిన వివరాలు చెప్పాడు. అతను చెప్పిన వివరాలను విన్నమీదట—రామనాథానికి అతి మూత్రవ్యాధి ఉన్నదని తెలుసుకున్నా. మూత్రం పరీక్ష చేశాను. షుగర్ చాలా పోతున్నట్టు తేలింది.

''ఆహారం విషయంలో మీరు ముందు వెనుకలు చూడ రనుకుంటాను !''

''అవునండి ! నాకు తిండి విషయంలో ఎటువంటి పట్టింపులూ లేవండి. నా చిన్నతనంలో తిండిలేక అనేక బాధలు పడ్డానండి. ఇప్పటికి భగవంతుడికి నామీద అనుగ్రహం కలి గింది. ముప్పూటలా లేదనుకోకుండా యింత తినగలుగు తున్నాను. తిండికి తిమ్మరాజు నేనుకోండి.''

''మీరు తిండి తగ్గించాలి. ఎక్కువ తినడంవల్లనే మీకీ జబ్బు వచ్చింది.''

''తిండి తగ్గించమంటారా ? అదెట్లాగండీ డాక్టరు గారూ ? .... నా చిన్నప్పుడే మా తండ్రి చనిపోయాడండి. ఉన్న ఆస్తి అమ్మి అప్పులు తీర్చానండి. ఆ తరువాత తినీ, తినక ఎంతో కష్టపడి దమ్మిడి దమ్మిడీ చొప్పున నిలవచేశాను. ఇప్పటికి పరిస్థితి మెరుగయిందండి. మీ దయవల్ల ఇంత పొలం పుట్రా, గొడ్డూ గోదా ఏర్పడ్డాయండి. తిండికి లోటు లేకుండా గడిచిపోతున్నదండి. ఇప్పుడు నన్ను తిండి మానేయ మంటే ఎలాగండీ ?''

''తప్పదు మరి ! కొన్ని రోజులు జాగ్రత్తగా ఉండాలి. పంచదార, అన్నం, బంగాళాదుంపలు—వీటిని ముట్టుకోరాదు.''

''ఇవి లేకపోతే ఎలాగండీ ?''

''ఏం ఫరవాలేదు. ఇంజెక్షన్ ఇవ్వాలి. పైగా రక్తం కూడా పరీక్ష చెయ్యాలి—మీ రక్తంలో ఎంత పంచదార ఉన్నదో చూడాలి.''

''రక్తంలో కూడా పంచదార ఉంటుం దేమి టండీ?''

''ఉంటుంది. రక్తంలో పంచదార ఎక్కువగా ఉంటేనే మూత్రంద్వారా బయటికి వస్తుంది.''

''ఓహో ! అలాగటండీ !''

రామనాథం మీసాలను సవరించుకుంటూ—''అంటే— ఇంకా నాకు చాలా ఖర్చు ఉన్నదన్నమాట !'' అని అన్నాడు.

''అవునవును. రక్తం పరీక్ష చెయ్యాలంటే పదహారు రూపాయ లవుతాయి. పైగా ఇంజెక్షన్ల ఖర్చు అదనం. వీటితోపాటు పథ్యంగా ఉండాలి.''

రామనాథం లేచివచ్చి నా రెండు చేతులూ పుచ్చుకొని— ''డాక్టరుగారూ ! రక్తం పరీక్ష చేసినందుకు ఫీజు ఎనిమిది రూపాయలు తీసుకోండి. అంతకంటే ఎక్కువ నే నిచ్చుకోలేను. కనికరించాలి. నేను ముందే చెప్పాను కదండీ—ఆ గుత్తా నరసయ్య మా బంధువేనండీ !''

చివరకు కనికరించక తప్పలేదు.

రక్తం తీసుకొని రామనాథంతో—మధ్యాహ్నం రమ్మ న్నాను. రక్తం పరీక్ష చేసిన తరువాతనే చికిత్స ఆరంభించా లన్నాను.

అంతవరకూ వసారాలో నిల్చున్న ఆ స్త్రీ నా గదిలో ప్రవేశించి—''అయ్యా ! డాక్టరుగారూ ! నన్ను రక్షించాలి!'' అని కాళ్లమీద పడింది.

''కాళ్లు వదులు ! విషయ మేమిటో చెప్పు ! ఏదీ మొహ మిలా తిప్పు !''

ఆమె మొహం పరీక్షగా చూశాను. రామనాథం కూడా అతి శ్రద్ధగా ఆమెను పరిశీలిస్తున్నాడు.

''ఈ జబ్బు నయంకావాలంటే చాలా డబ్బు ఖర్చవు తుంది. మరి భరించుకోగలవా ?'' అని అడిగాను ఆ స్త్రీని !

ఆమె పమిటచెంగు లోపలినుంచి వెండి కడియాలు రెండు తీసి నా ముందు ఉంచింది.

''నా దగ్గరున్న ఆస్తి యిదేనండి ! ఇవి తీసుకొని నా జబ్బు ఎలాగైనా నయం చేయండి డాక్టరుగారూ !''

''ఈ కడియాలు నేనేం చేసుకోను ? నువ్వు నాకేమీ యివ్వ నవసరంలేదులే ! మందుల ఖర్చు మాత్రం భరించుకో!''

''మందులు ఎంతవుతాయండి ?''

''ఏభై రూపాయల మందులు కావాలి. పైగా రక్త పరీక్ష కూడా చేయించుకోవాలి.''

"రక్తపరీక్షకు ఎంతవుతుందండీ ?"

"ఆ డబ్బు కూడా నేను వదులుకుంటాను. మందులు మాత్రం కొనుక్కో !"

ఆ స్త్రీ కన్నీళ్లు కారుస్తూ నిలబడిందే గాని మారు మాట్లాడలేదు.

"ఈ కడియాలు ఎంత ఉంటాయి ?"

"ఎప్పుడో చాలాకాలం క్రిందట ముప్పై రూపాయలకు కొన్నానండి !"

"వీటిని ఇప్పుడు అమ్మితే పది రూపాయలు కూడా రావు !" అని అన్నాడు రామనాథం.

ఆ స్త్రీ మరల నా కాళ్లమీద పడడానికి ప్రయత్నించింది.
మవ్వెళ్లి వసారాలో కూర్చో ! నీ కేసు విషయం కొంచెం తీరికగా ఆలోచిస్తా. లేకపోతే పెద్ద ఆస్పత్రికి ఉత్తరం రాసి యిస్తా, తీసుకెళ్లు !"

"అక్కడికి వెళ్లి వచ్చానండి. వాళ్లు కూడా డబ్బు అడిగారండి !" అని చెప్పింది. ఆమె కళ్లవెంట కన్నీరు ధారలుగా ప్రవహిస్తున్నది.

"ఏడ్పి ప్రయోజన మేముంది చెప్పు ?—వెళ్లి బయట కూర్చో ! మళ్లీ పిలుస్తాము."

కాంపిల్ మందులు ఏమైనా ఉన్నాయేమోనని అటూ యిటూ చూస్తూ ఉండగా—రామనాథం నావైపుకు తిరిగి—

"అయ్యా డాక్టరుగారూ ! ఏభై రూపాయలుంటే ఆమె ఆరోగ్యం బాగుపడుతుం దంటారా ?"

"ఆఁ .... బాగుపడుతుంది."

రామనాథం మీసాలను సవరించుకుంటూ—కొంచెం సేపు ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"డాక్టర్‌గారూ ! డబ్బు నేను పెట్టుకుంటాను. ఆమెకు చికిత్స ప్రారంభించండి."

"డబ్బు మీరిస్తారా ?"

నే నడిగినదానికి రామనాథం సమాధానం చెప్పకుండా అవతల గోడకు ఆనించి ఉంచిన సంచీ చేతిలోకి తీసుకుని దానిలోనుంచి అయిదు పదేసి రూపాయల నోట్లను బయటికి తీశాడు. తీసి నా చేతి కందించాడు.

"డాక్టరుగారూ ! ఈ డబ్బు ఉన్నది చూశారూ ! చాలా పాపిష్టిదండి ! ఈ పాపిష్టి డబ్బే నన్ను నాశనం చేసింది."

రామనాథం ఇంతటి వేదాంతపరమైన విషయం మాట్లాడతాడని నే నూహించుకోలేకపోయాను. పైపెచ్చు నా కెందుకో ఒక సందేహం కూడా కలిగింది.

"ఆమె మీ కేమైనా బంధువా ?"

"అబ్బే, లేదండి !" .... అయితే—" రామనాథం అటూ యిటూ చూశాడు.

"విషయ మేమిటో చెప్పండి !"

"విషయమేమీ లేదండి ! ఆమె మొహంలో మా తల్లి పోలిక లున్నాయండి !"

"మా నాన్న చనిపోయిన మాసం రోజులకే మా అమ్మ కూడా కన్ను మూసింది. మా అమ్మకు జబ్బుచేస్తే—డాక్టరుకు చూపించే తాహతు లేకపోయింది !" అన్నాడు రామనాథం—నూతిలోనుంచి మాట్లాడుతున్నట్టు !

నా ఆశ్చర్యానికి మేరలేకపోయింది. రామనాథంవైపు తదేకంగా చూశాను. అతని నేత్రాలు అశ్రుమయమైనాయి.

శా. సౌరభ్యంబును బంధచాతురి తగన్ శయ్యా చమత్కారత్వం
గారంబున్ విశదార్థముల్ సరస సాంగత్యంబు నానాకళా
పారీణత్వము మంజు వాగ్విభవమున్ బొంచాలు రీతిం దగన్
వారస్త్రీయునుబోలె నొప్పవలదా వర్ణింపఁ గావ్యంబిలన్

ప్రౌఢకవి మల్లన-రుక్మాంగద చరిత్ర